క్లుప్తంగా

యాదాద్రిలో ఎమ్మెల్యే పూజలు



పెద్దారెడ్డికి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి రాజు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు పూజలు చేశారు. స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డికి ఆచార్యులే వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

2వ వార్డులో కమిషనర్ పర్యటన

తాడిపత్రి అర్బన్: స్థానిక 2వ వార్డులోని ఏటిగడ్డ పాలెంలో శనివారం మున్సిపల్ కమిషనర్ జి.రవి కౌన్సిలర్ ఫయాజ్ బాషాతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా జామియా మసీదు పక్కన నిలిచిన మురుగునీటిని పరిశీలించారు. సీసీరోడ్డుతో మురుగునీరు నిల్వ లేకుండా చేయొచ్చని, సీసీరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని కమిషనర్ మున్సిపల్ డీఈ వెంకటసుబ్బయ్యను ఆదేశించారు. స్థానికులు మురుగునీరు, వీధిదీపాల సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానికులు వాటర్ ప్లాంట్ నిర్వహణకు సిద్ధమైతే ట్రస్టు ద్వారా ప్లాంట్ ఏర్పాటు చేస్తానని ఫయాజ్ బాషా ప్రకటించారు.

స్వచ్ఛతే ప్రజల కర్తవ్యం



స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నార్పల: ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందించాలంటే స్వచ్ఛతే మన కర్తవ్యంగా భావించాలని డీఎల్‌పీఓ సమన జయంతి, ఎంపీడీఓ దివాకర్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో వారు పాఠశాల విద్యార్థులతో కలసి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ గ్రామస్తులంతా ఇళ్లు, పరిసరాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల దోమలు తగ్గడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సర్పంచు మన్నీల సుప్రియ, ఎంఈఓ నారపరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

పెద్దపప్పూరు: యాడికి పీహెచ్‌సీని శనివారం సివిల్ సర్జన్ డాక్టర్ సైదన్న తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్ కంటి వెలుగు, ఉచిత ఆపరేషన్లు, కంటి అద్దాల పంపిణీ, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలపై ఆరా తీశారు. మండల వైద్యాధికారి శ్రీరామ్‌కుమార్, తాడిపత్రి డివిజన్ జీపీఎంఓ మధుసూదన్ రాజు ఉన్నారు.


ట్యాంకు ఆవరణలో కమిషనర్ శ్రమదానం



చెత్త తొలగిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: స్వచ్ఛతా లీగ్ 2.0, సఫాయి మిత్ర సురక్ష షివిర్ కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, వివిధ విభాగాల అధికారులు మండీబజార్ మున్సిపల్ వాటర్ ట్యాంక్ కాంపౌండ్‌లో శ్రమదానం చేశారు. పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. డ్రైనేజీలను శుభ్రం చేశారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని కమిషనర్ తెలియజేశారు. మున్సిపల్ ఎంఈ గురప్పయాదవ్, డీఈ రామ్మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, చంద్రశేఖర్, సెక్రటరీలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాతలకు ధ్రువపత్రాలను అందిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు : తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శనివారం తహసీల్దార్ నాగభూషణ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 32 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ యువత రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ధ్రువీకరణ ప్రతాలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎద్దుల శరబారెడ్డి, యువజన విభాగం కన్వీనర్ కృష్ణారెడ్డి, చిన్నవడుగూరు సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ రామన్న, ఆర్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే జగనన్న ధ్యేయం



ఆర్బీకేను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

బుక్కరాయసముద్రం: రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని గాంధీ నగర్‌లో రైతు భరోసా కేంద్రాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సర్పంచ్ పార్వతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో ప్రజల ముంగింటకే ప్రభుత్వం సేవలు అందిస్తున్నారన్నారు. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆయా గ్రామాల్లోనే రైతులకు విత్తనాలు, ఎరువులను అందిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో రైతులు విత్తన కాయలు తీసుకోవాలంటే రెండు రోజుల ముందే మండల కేంద్రాలకు రావాల్సి వచ్చేదన్నారు. ఆర్బీకేలతో రైతులకు అన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కాంట్రాక్టర్ పూల నారాయణ స్వామిని అభినందించారు.

మార్కెట్ గోడౌన్ నిర్మాణానికి శంకుస్థాపన

మండల కేంద్రంలోని కొత్తపల్లి రోడ్డు సమీపాన సొసైటీ ఆధ్వర్యంలో రూ.70 లక్షలతో వ్యవసాయ మార్కెట్ గోడౌన్ నిర్మాణానికి ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఎరువులు, వ్యవసాయ పనిముట్లను నిల్వ ఉంచేందుకు వీలుగా గోడౌన్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఆలూరి రమణారెడ్డి, మండల కన్వీనర్ అంకే నరేష్, వైస్ ఎంపీపీ రామగోపాల్, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, ఎంపీటీసీలు వెంకటలక్ష్మి, శిరీజ, మిద్దె కుళ్లాయప్ప, చికెన్ నారాయణస్వామి, బుల్లే నారాయణస్వామి, నాగలింగారెడ్డి, ముత్యాలశీన కొండమ్మ, ఆగ్రోస్ రామకృష్ణారెడ్డి, పురుషోత్తం, కొండన్న, బూసీ, కాటమయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం



జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 26వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. సర్వే పకడ్బందీగా నిర్వహించి వివరాలను క్షుణ్ణంగా పొందుపరచాలని సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ వైద్యరంగలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రులను ఆధునీకరించి, వైద్యసేవలను మెరుగు పరిచారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానంతో వైద్య సేవలను ప్రజల ముంగిటకే చేర్చారని వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిలో ఉన్న ప్రతి ఒక్కరి ఆరోగ్యం గురించి ప్రభుత్వ సిబ్బంది వాకబు చేసి ఆ తర్వాత వైద్య శిబిరాల్లో పరీక్షలు చేసి అవసరమైతే వారికి మెరుగైన వైద్యాన్ని అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు జబ్బార్, జావిద్, బాబా తదితరులు పాల్గొన్నారు.

నిరసన దీక్షతో 'తమ్ముళ్ల' విభేదాలు బహిర్గతం

యల్లనూరు: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా తెలుగు తమ్ముళ్లు చేపట్టిన నిరసన దీక్షలో వర్గ విభేదాలు బహిర్గతమయ్యాయి. శనివారం మండల కేంద్రంలో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి నిరసన దీక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు వర్గం గైర్హాజరైంది. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రావణి వర్గం మాత్రమే హాజరైంది. ఆధిపత్యంలో భాగంగానే ఒక వర్గం హాజరుకాలేదని అక్కడికొచ్చిన వారు చర్చించుకోవడం కనిపించింది.

తహసీల్దారు కార్యాలయానికి వెళ్లేదెలా?

టీడీపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారిలో నిరసన దీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. రోడ్డుకు పూర్తిగా అడ్డుగా ఉండటంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడ్డారు. రోడ్డుకు అడ్డంగా కూర్చుకుంటే తామెలా తిరగాలని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

30లోపు పంట నమోదు చేసుకోవాలి

గార్లదిన్నె: రైతులు ఈనెల 30లోపు ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఏఓ సోమశేఖర్ పేర్కొన్నారు. శనివారం ఏఓ మాట్లాడుతూ పంటలు సాగుచేసిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించాలన్నారు.

బ్రూసెల్లోసిస్‌పై అప్రమత్తంగా ఉండాలి



గొర్రెల నుంచి రక్త నమూనాలను సేకరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: బ్రూసెల్లోసిస్ పశువుల నుంచి మనుషులకు వ్యాపించే ప్రమాదం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు నాయక్ సూచించారు. శనివారం వెంకటాంపల్లిలో పశువిజ్ఞానబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. యాజమాన్య పద్ధతులపై గొర్రెలు, మేకల కాపర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా గొర్రెలు, మేకల్లో ప్రధాన ఆరోగ్య సమస్య అయిన బ్రూసెల్లోసిస్ గురించి వివరించడంతో పాటు, దాదాపు 30 గొర్రెల నుంచి రక్తనమూనాలను సేకరించి విజయవాడలోని ప్రాంతీయ పరిశోధన కేంద్రానికి తరలించారు. వ్యాధి బారిన పడిన గొర్రెలు, మేకలు చివరి మూడు నెలల చూడికాలమందు ఈసుకుపోతాయని తెలిపారు. పొట్టేళ్లలో బీజాలు వాయడం, సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గిపోవడం, బలహీనమైన పిల్లలు పుట్టడం, ఈతకు ఈతకు మధ్య కాలం పెరగటం వంటి వాటివల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతారన్నారు. ఈసుకుపోతున్న గొర్రెలు, మేకలను గుర్తించి ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేయించాలని, వ్యాధి నిర్ధారణ అయితే మంద నుంచి వేరు చేయాలన్నారు. విత్తన పొట్టేళ్లను ప్రతి మూడేళ్లకోసారి మార్చాలని సూచించారు. ఈవ్యాధిబారిన పడకుండా పిల్లలకు నాలుగు నుంచి 8 నెలల వయస్సులో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. పశుశాఖ అసిస్టెంట్ ఈరన్న, శ్రీనివాసులు, సవ్య, జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

టెక్ కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టెక్ కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి

తాడిపత్రి: రూరల్ పరిధిలోని తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి ఇంజినీరింగ్ విద్యార్థులు ఎలా ఉండాలి, ఎలా నడుచుకోవాలి, వారి లక్ష్యాలు ఏ విధంగా ఉండాలి, వాటిని సాధించేందుకు అవసరమైన క్రమశిక్షణ తదితర వాటిని వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఈవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ విద్యలో రాణించేందుకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో డీఓఏ నటరాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ భానుప్రసాద్, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

తాడిపత్రి: ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం 22వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం తాడిపత్రి నియోజకవర్గ నాయకులుపోస్టర్లను ఆవిష్కరించారు. రంగప్ప కాలనీలో జరిగిన కార్యక్రమానికి సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య హాజరై మాట్లాడారు. ఈ నెల 25 నుంచి 27 వరకు బాపట్లలో జరిగే మహా సభలను విజయవంతం చేయాలని కోరారు. సంఘం తాడిపత్రి నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, సీపీఐ తాడిపత్రిమండల కార్యదర్శి నాగరంగయ్య, నియోజకవర్గ సహాయ కార్యదర్శులు సురేష్, ఎర్రప్ప, మహిళా నేత లక్ష్మీబాయి పాల్గొన్నారు.

కీర్తన కుటుంబాన్ని ఆదుకోవాలి

గుంతకల్లుటౌన్: శ్రీవిద్య ప్రైవేట్ పాఠశాలలో బండరాయి విరిగిపడి మృతి చెందిన కీర్తన అనే విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ శనివారం ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు. పట్టణంలో ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకటేష్, నాయకులు రమేష్, శివ, రఘు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అనర్థదాయకం

గుత్తి రూరల్: బాల్య వివాహాలు అనర్థదాయకమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్ప, ఎంఎస్ కె.ఫిరోజ్ పేర్కొన్నారు. తురకపల్లిలో శనివారం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దార్ మహబూబ్ బాషా పరిశీలించారు. కోట ఉన్నత పాఠశాల, ఎంఎస్ హైస్కూల్, బహార్ పేట, అనంతపురం, తాడిపత్రి రోడ్డులో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నీటి వసతి, విద్యుత్ కనెక్షన్ వంటి సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్ఐ సందీప్, వీఆర్వో పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

పెద్దవడుగూరు: మిడుతూరు సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. తానీషా అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరు నుంచి హైదరాబాద్ బయలుదేరాడు. మిడుతూరు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కంపచెట్లలోకి దూసుకెళ్లింది. ఘటనలో కారులో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని కర్నూలుకు తరలించారు. పోలీసులుదర్యాప్తు చేపట్టారు.

గార్లదిన్నెలో ఒకరికి గాయాలు

గార్లదిన్నె: ఎగువపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. రాయదుర్గం మండలం వేపరాలకు చెందిన వన్నూర్‌స్వామి ఎగువపల్లి వద్ద ఓ హోటల్లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహించేవాడు. వన్నూర్‌స్వామి రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

శింగనమల: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని డీపీఎం లక్ష్మానాయక్ తెలిపారు. శనివారం సోదనపల్లి , చిన్నమట్లగొంది, పెద్దమట్లగొంది గ్రామాల్లో రైతులు భాగ్యమ్మ, సుంకిరెడ్డి, హనుమంతు సాగు చేసిన వేరుశనగ, కూరగాయల పంటలను పరిశీలించారు. బీడు పొలాల్లో చీని, దానిమ్మ, సీతాఫలం సాగు చేసిన పొలాల్లో డ్రాట్ ప్రూఫింగ్ విధానంలో కంది, ఆముదం, అలసంద, అనుములు, గోరుచిక్కుడు, సజ్జ విత్తనాలతో ఘన జీవామృతం వేసి విత్తుకోవడాన్ని వివరించారు. ఎస్ఆర్‌పీ నరేంద్ర, జిల్లా కోఆర్డినేటర్ భానుమతి, పీఆర్‌పీ రామచంద్ర, రైతులు పాల్గొన్నారు.

సజావుగా 'ప్రజావేదిక'



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డ్వామా ఏపీడీ సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం 17వ విడత సామాజిక తనిఖీపై ప్రజావేదిక(బహిరంగ సభ) కార్యక్రమం సజావుగా జరిగింది. మండలంలో గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకూ 890 ఉపాధి హామీ పనుల కోసం రూ.13.53 కోట్లు వెచ్చించారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు తనిఖీలో వెల్లడైన విషయాలను చదివి వినిపించారు. రూ.14 వేల రికవరీకి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఏపీడీ వెంకటరత్నం, ఏవీఓ మహమ్మద్ ఫర్వీన్, అంబుడ్స్‌మన్ మధుసూదన్, జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి , ఎంపీపీ గంగాదేవి, ఎంపీటీసీ తిమోతి, ఎంపీడీఓ వీరరాజు, ఏపీఓ షబ్బీర్‌బాషా, ఎస్ఆర్పీ భాస్కర్, పంచాయతీ రాజ్ జేఈ నరేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోండి

శింగనమల: మండలంలో ఇంటి స్థలం ఉన్న వారు గృహ నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ డీఈ శ్రీమన్నారాయణ సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్, ఎంపీడీఓ నిర్మలాకుమారి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలపై ఆసక్తి ఉన్న వారి నుంచి సచివాలయాల్లో స్వీకరించాలన్నారు. నెల రోజులలోపు ఇళ్లు మంజూరు చేస్తామన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

పామిడి: పట్టణంలోని 17వ వార్డుకు చెందిన పూజారి వెంకటరమణ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను పట్టణ సచివాలయాల కన్వీనర్ బీ ఆసిఫ్,టీఎంసీ చంద్రశేఖర్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఆంజనేయులు శనివారం మృతుడి భార్య లక్ష్మీదేవికి అందజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: స్థానిక మౌలానా అబుల్ కలాం అజాద్ ఫంక్షన్ హాలులో శనివారం ఫయాజ్‌బాషా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన లభించింది. ఈసందర్భంగా ఫయాజ్‌బాషా మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గుండె, కంటి, ఆర్థో, కిడ్నీ తదితర ఆరోగ్య సమస్యలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పేదలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతపురం కిమ్స్ సవీరా వైద్యులు 280 మందికి వివిధ పరీక్షలు నిర్వహించారు. ముస్లిం మతపెద్దలు కె.ఆరీఫ్ సుల్తాన్‌బాషా ఖాద్రీ, ఆరీఫ్ సాహెబ్, దాదా బాషా సాహెబ్, మిన్‌హాజ్, వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు షాషావలి, ఉపాధ్యక్షుడు మహబుబ్‌బాషా, కౌన్సిలర్ రంగనాథ్‌రెడ్డి, రియాజ్, హాజీవలి, వైఎస్సార్ సీపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, కుమార్, జునైద్, గురుప్రసాద్‌రెడ్డి, ఆలూరు ప్రసాద్ పాల్గొన్నారు.

26న కంటి వైద్యశిబిరం

గుంతకల్లుటౌన్: లయన్స్‌క్లబ్ సహకారంతో ఈ నెల 26న మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ పీహెచ్, నాన్ పీహెచ్ వర్కర్ల కోసం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నారు. శనివారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఆయా పీహెచ్ డివిజన్ కార్యాలయాల వద్దకు వెళ్లి వైద్యశిబిరం గురించి కార్మికులకు తెలియజేశారు. వైద్యపరీక్షల అనంతరం అవసరమైన వారికి కంటి అద్దాలను ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి చేద్దాం



ఆముదం పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

బుక్కరాయసముద్రం: జిల్లాలో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సమన్వయంతో రైతుల అభ్యున్నతికి కృషి చేద్దామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. శనివారం రేకులకుంటలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి అధ్యక్షతన శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ రైతాంగానికి నిరంతరం పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, సలహాలు సూచనలు అందించాలన్నారు. ప్రభుత్వం అందించే రాయితీలను వివరించాలన్నారు. రైతులు పంటల మార్పిడి తప్పనిసరిగా చేపట్టాలన్నారు. రైతులకు అందుబాటులో ప్రత్యామ్నాయ విత్తనాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అనంతరం రేకులకుంటలో ఆముదం పంటను పరిశీలించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుబ్రహ్మణ్యం, బీకేఎస్ పశుశాఖ ఏడీ డాక్టర్ రత్నకుమార్, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ పరీక్షలు తప్పనిసరి



గర్భకోశ పరీక్షలు నిర్వహిస్తున్న పశువైద్యాధికారులు

నార్పల: సుడి నిర్ధారణ, ఎదకు వచ్చిన కట్టకుండా నిలిచిపోవడం, పూర్తిగా ఎదకు రాని పశువులకు గర్భకోశ పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి సుధాకర్ పేర్కొన్నారు. శనివారం ఆయన గుంజేపల్లి గ్రామంలో పశువుల గర్భకోశ శిబిరం ఏర్పాటు చేసి పశువులకు గర్భస్థ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ పథకం గురించి పాడి రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ పథకం ద్వారా రూ.1,350 విలువ గల పెయ్యదూడలను పొందే రెండు సూదులను రూ.850 సబ్సిడీ పోగ రూ.500 కే రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. పశు వైద్యధికారి రాధిక తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూమిపై శాశ్వత హక్కు



రైతులకు భూ హక్కు పత్రం అందిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

యల్లనూరు: రీ సర్వేతో రైతులకు భూములపై శాశ్వత హక్కు లభిస్తుందని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. శనివారం నిట్టూరులో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష పత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద భూ సర్వే చేపట్టలేదన్నారు. ప్రజలకు ఉపయోగకరంగా, అక్రమాలు, కబ్జాలకు తావు లేకుండా అత్యాధుని సాంకేతిక పరికరాలతో భూ సర్వే చేస్తున్నారన్నారు. మొత్తం 359 మంది రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుమతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు ఈశ్వరరెడ్డి, సచివాలయ మండల కన్వీనరు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు నిట్టూరు శ్రీనివాసులరెడ్డి, గంగిరెడ్డి, నాగేంద్ర, మేడికుర్తి జయరామిరెడ్డి, వేములపల్లి ప్రతాప్‌రెడ్డి, కొత్తపల్లి పురుషోత్తంనాయుడు, పెద్దమల్లేపల్లి చంద్ర, యల్లనూరు ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: రీసర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ రాము పేర్కొన్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కింద సంగాల, తిమ్మాపురం, దంచర్ల గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తయిన నేపథ్యంలో శనివారం ఆయా గ్రామాల్లోని రైతులకు రీసర్వే డీటీ ఆదినారాయణ ఆధ్వర్యంలో భూ హక్కు పత్రాలను అందజేశారు.

హ్యూమన్ రైట్స్ కమిషన్ నూతన కమిటీ ఎంపిక

గుత్తి: హ్యూమన్ రైట్స్ నూతన మండల కమిటీని శనివారం ఎంపిక చేశారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ నేషనల్ ప్రెసిడెంట్ హాజి మహ్మద్ ముజాహిద్ సమక్షంలో కమిటీ అధ్యక్షుడిగా షేక్ వలి, ఉపాధ్యక్షుడిగా షేక్ మాఫిర్, కార్యదర్శిగా సయ్యద్ షెక్షావలి ఎంపికయ్యారు.

సీజ్ చేసిన డీజిల్ వేలం

గుంతకల్లు రూరల్: గుంతకల్లు ఆర్టీసీ డిపోలో గతంలో సీజ్ చేసిన డీజిల్‌కు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. ఆరు నెలల క్రితం స్థానిక ఆర్టీసీ డిపోలో 12 వేల లీటర్ల డీజిల్‌ను అధికారులు సీజ్ చేశారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం తహసీల్దార్ రాము, సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో డీజిల్‌కు వేలంపాట నిర్వహించారు.

20 మంది బైండోవర్

పుట్లూరు: గరుగుచింతలపల్లికి చెందిన 20 మందిని శనివారం బైండోవర్ చేసినట్లు ఏఎస్ఐ హనుమంతు తెలిపారు. గ్రామంలో వివాదాస్పదంగా వ్యవహరిస్తున్న రెండు వర్గాలకు చెందిన 20 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.

తలనీలాల సేకరణకు వేలం

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలు సేకరించుకనే హక్కు కోసం శనివారం వేలంపాట నిర్వహించారు. అనసూయమ్మ రూ.1.80 లక్షలకు వేలం దక్కించుకున్నట్లు ఈఓ దేవదాసు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ వేల్పుల సోమశేఖర్ యాదవ్, సభ్యులు డేగ బాల రంగయ్య, ప్రమీల గౌడ్, సింగిల్ విండో అధ్యక్షుడు పురుషోత్తం యాదవ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం

బుక్కరాయసముద్రం: నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు నివారిద్దామని ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో అసోసియేషన్ ఫర్ గ్లోబల్ రూరల్ అలర్ట్ (ఆగ్రా) సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, ప్రభుత్వ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, బాలికల రక్షణ కోసం అనేక చట్టాలను ప్రవేశ పెట్టిందన్నారు. ఎంఈఐ రఘునందన్, హెచ్ఎం వసుంధర, ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, ఎన్జీఓ రామప్ప, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు నారాయణస్వామి పాల్గొన్నారు.